విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

నేడు జిల్లా సమీక్షా కమిటీ సమావేశం

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరు జిల్లా సమీక్షా కమిటీ సమావేశం కలెక్టరేట్ లోని గోదావరి సమావేశం మందిరంలో బుధవారం ఉదయం గం.10.00లకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్ అధ్యక్షతన జరిగే సమావేశంలో నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు, నాడు-నేడు పనులు, ధాన్యం కొనుగోలు, వ్యవసాయ అనుబంధరంగాలు, ఆర్ డబ్ల్యుఎస్, వైద్యం, గడప గడపకు మన ప్రభుత్వం తదితర అంశాలపై సమీక్ష జరుగుతుందన్నారు. సమీక్షా కమిటీ సమావేశానికి సంబంధిత అధికారులందరూ పూర్తి సమాచారంతో తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

నేడు సీపీఐ ప.గో.జిల్లా సమితి సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర -భీమవరం: 30 వ తేదీ బుధవారం మధ్యాహ్నం 1 గంటకు భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించే సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా సమితి సర్వసభ్య సమావేశాన్ని పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని పశ్చిమగోదావరి జిల్లా సీపీఐ కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన భీమవరంలో మీడియాతో మాట్లాడుతూ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, అతిథిగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ పాల్గొంటారన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర, జాతీయ మహాసభల నిర్ణయాలు, లక్ష్యాలు వివరిస్తారని ఆయన తెలిపారు. పార్టీ గ్రామ శాఖా కార్యదర్శులు, మండల, పట్టణ, జిల్లా సమితి సభ్యులందరూ విధిగా సమావేశానికి సకాలంలో హాజరుకావాలని కోనాల కోరారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు

విశాలాంధ్ర-టి.నరసాపురం: ప్రభుత్వం జగనన్న కాలనీల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని జడ్పీటీసీ సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు అన్నారు. బొర్రంపాలెం గ్రామంలో జగనన్న కాలనీ లే అవుట్ లో త్రాగునీటి బోరు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లే అవుట్ లో ఇళ్ళ నిర్మాణానికి కావలసిన సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని ఆయన తెలిపారు. కాలనీల్లో ప్రభుత్వం త్రాగునీరు,విద్యుత్ సౌకర్యం,డ్రైనేజీ, సిమెంటు రోడ్లు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. జగనన్న కాలనీలలో ఇళ్ళ నిర్మాణం పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డి లక్ష్మి, సర్పంచ్ కలపర్తి వెంకటేశ్వరమ్మ, ఎంపిటిసిలు కలపర్తి సుజాత, తోట శ్యామల,మాజీ ఎంపీపీ కొత్త ప్రకాష్ బాబు, హౌసింగ్ ఎఇ జి. రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మన్యసీమ దర్శిని

విశాలాంధ్ర-ఉంగుటూరు: మన్య సీమ దర్శిని బస్సు తాడేపల్లిగూడెం డిపో నుండి ప్రతి ఆదివారం ఉదయం ఐదు గంటలకు బయలుదేరుతుందని ఆ డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి మంగళవారం విలేకరులకు తెలిపారు. కోరుకొండ లక్ష్మీనారాయణ నరసింహస్వామి ఆలయం, సీతపల్లి గడిపాపనమ్మ ఆలయం, మారేడుమిల్లి కాఫీ గార్డెన్స్, మిరియాల గార్డెన్స్, రబ్బర్ ప్లాంటేషన్, ఔషధ మొక్కలు, జలతరంగిణి వ్యూ పాయింట్, పాములేరు వాగు దర్శించి తిరుగు ప్రయాణంలో రాజమండ్రి ఇస్కాన్ టెంపుల్ పుష్కరాలు రేవు మీదగా రాత్రి 9 గంటలకు తాడేపల్లిగూడెం చేరుతుందన్నారు. చార్జీల వివరములు పల్లె వెలుగు బస్సు రూ.290, సూపర్ లగ్జరీ బస్సు రూ.480గా నిర్ణయించామని,ఈ అవకాశాన్ని వ్యాపారస్తులు ఉద్యోగస్తులు విద్యార్థులు వినియోగించుకోవలసిందిగా కోరారు. వివరాలు కోసం యేలూరి సత్యనారాయణ మూర్తి, డిపో మేనేజర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తాడేపల్లిగూడెం వివరముల కొరకు,99 59753102 సంప్రదించగలరు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని ఆందోళన

విశాలాంధ్ర-టి.నరసాపురం : మండలంలోని బంధంచర్ల గ్రామం మీదుగా చింతలపూడి వెళ్ళే ఏలూరు డిపో ఆర్టీసీ బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని కోరుతూ విద్యార్థులు ప్ల కార్డులు ప్రదర్శనతో మంగళవారం ఆందోళన చేసారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాచప్రోలు చరణ్, మారుముళ్ళ అభిలాష్ మాట్లాడుతూ గత 30ఏళ్ళుగా ఏలూరు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు మండలంలోని బంధంచర్ల, టి. నరసాపురం మీదుగా చింతలపూడి ఉదయం, సాయంత్రం బస్సు సర్వీసు ఉండేది అన్నారు. ఈ నేపథ్యంలో గత నెల రోజులుగా ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం నిలిపివేయడంతో బంధంచర్ల, కేతవరం, రాజుపోతేపల్లి, అల్లంచర్ల పంచాయతీ లోని విద్యార్థులు, ప్రయాణికులు, ఆసుపత్రికి వెళ్ళే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు సౌకర్యం నిలిపివేయడంతో విద్యార్థులు టి నరసాపురం వరకు నడుచుకుంటూ వెళ్ళాల్సి వస్తోందని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి బస్సు సర్వీసు పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బేతి సత్యనారాయణ, కనిపెడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర - చింతలపూడి : ఉద్యోగులు సంఘటిత పోరాటం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఎన్జీవో సంఘ కార్యదర్శి నెరుసి రామారావు పిలుపునిచ్చారు. మంగళవారం చింతలపూడిలో తాలూకా ఎన్జీఒ సంఘ సమావేశంలో మాట్లాడుతూ ఏపీ ఎన్జీవో సంఘం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేస్తుందన్నారు. ఏలూరు తాలూకా అధ్యక్షులు గున్నూరు శ్రీధర్ రాజు మాట్లాడుతూ సంఘాలను పటిష్ట పరుస్తూ ఉద్యోగులు ఐక్య పోరాటాలు చేయటం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయవచ్చన్నారు. చింతల పూడి తాలూకాకు నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు. అధ్యక్షులుగా వి. గంగాధర్ రావు, కార్యదర్శిగా కె. పెద్దిరాజు, కోశాధికారిగా టి. మల్లయ్య, సహ అధ్యక్షులుగా ఇందిరా ప్రియదర్శిని, ఉపా ధ్యక్షులుగా నాగబాబు, మంగరాజు, రామకృష్ణ, వి. రమేష్, సహాయ కార్యదర్శిగా రత్న రాజు, రమేష్ తది తరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరు అమీనాపేట లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ ప్రత్యేక బాలికల, సమీకృత బాలుర వసతి గృహంలోని విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన దుప్పట్లను 31వ డివిజన్ కార్పొరేటర్ పి. లక్ష్మణ్ రావు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. సంక్షేమ గృహాలను నాడు-నేడు కార్యక్రమం కింద అభివృద్ధి చేసి, పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నదన్నారు. సంక్షేమ గృహాలలో విద్యార్థులు చలికాలంలో ఇబ్బంది పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ విద్యార్థినీ, విద్యార్థికీ దుప్పట్లను మంజూరు చేసిందని లక్ష్మణరావు చెప్పారు. ఈ సందర్భంగా సంక్షేమ గృహంలో విద్యార్థుల వసతి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే అందిస్తున్నారా లేదా అని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమం లో వసతి గృహ సంక్షేమ అధికారులు రామారావు, రాధా, సురేష్, హరిబాబు, స్థానిక నాయకులు బండారు కిరణ్ కుమార్, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సమస్యలపై ఉద్యమించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్

విశాలాంధ్ర - ఏలూరు : మహిళా సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా ఇన్‌చార్జి దేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఏలూరు జిల్లా సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు ఏరియా సమితి సమావేశం నగర కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిర అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దేగా ప్రభాకర్ మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యం లేనిదే సమాజం మనుగడ లేదన్నారు. సృష్టి అంతా మహిళలచే ముడిపడి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పాత కాలం నాటి విధానాలను అవలంభించి అమలు చేయడానికి కుట్ర చేస్తున్నదని అన్నారు. బిజెపి అనుయాయులు బాబా రాందేవ్, గరికపాటి నరసింహా రావు మహిళలను వస్త్రధారణ పై కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేట న్నారు. ఇటువంటి వ్యాఖ్యలను మహిళా సమాఖ్య ప్రతిఘటించడం ద్వారా గుణపాఠం చెప్పాల న్నారు. సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ మహిళా సమాఖ్య చేసే పోరాటాలకు పూర్తి మద్దతు, సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి సభ్యులు కొండేటి బేబి మాట్లాడుతూ మహిళలకు సమ న్యాయం ఉండాలన్నారు. గృహహింసకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సభకు అధ్యక్షత వహించిన మహిళా సమాఖ్య నగర కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిర మాట్లాడుతూ ఇటీవల మహిళలపై వరుస దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా యని వీటిని నియంత్రించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను పటిష్టంగా అమలు చేసి కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం దేగా ప్రభాకర్‌ను మహిళా సమాఖ్య ఏరియా ఘనంగా సత్కరిం చింది. ఈ కార్యక్ర మంలో ఏఐటీయూసీ నాయకులు కె. కృష్ణమా చార్యులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాస్, జిల్లా నాయకులు చాట్ల పుల్లారావు, తొర్ల పాటి బాబు,మహిళా సమాఖ్య ఏలూరు ఏరియా సమితి సభ్యులు కొల్లూరి సుధ, ఉప్పులూరి లక్ష్మి, ఉప్పులూరి భవాని,జి. స్వాతి తదితరులు పాల్గొన్నారు.

డీఈఈ సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలి

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర- ఏలూరు : కింది స్థాయి ఉద్యోగులను కించ పరుస్తూ, భౌతిక దాడులకు పాల్పడుతున్న డీఈఈ వంగపండు సత్యనారాయణ పై చర్యలు తీసుకోవాలని ఏఐటీయుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నగర కార్యదర్శి ఎ.అప్పలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి బండి వెంకటేశ్వరరావు, అప్పలరాజు మాట్లాడుతూ రెండు నెలల క్రితం యూనియన్ కోశాధికారి, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ నారాయణరావును అసభ్య పదజాలంతో దూషిస్తూ భౌతిక దాడికి పాల్పడ్డారన్నారు. దాడికి పాల్పడిన సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు విజ్ఞాపన పత్రాలు అందజేసినా ఫలితం శూన్యం అన్నారు. ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు సత్యనారాయణ పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినా స్పందించలేదని విమర్శించారు. తక్షణం సత్యనారాయణ పై చర్యలు తీసుకుని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రెగ్యులర్ కార్మికులకు చెల్లించాల్సిన 2021,22 సరెండర్ లీవ్ చెల్లించాలన్నారు. కాంట్రాక్టు సిబ్బందికి 2018లో వేతనాలు పెరిగిన చెల్లించాల్సిన 17 నెలల అరియర్స్ తక్షణం చెల్లించాలని కోరారు. 11వ పిఆర్‌సి ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు సర్వీస్ ప్రాతిపదికగా క్రమబద్ధీ కరించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో బి. నాగేశ్వరరావు, పివి రమణ, బి. పెద్దిరాజు, కె. రామకృష్ణ, పోలా భాస్కర్, గేదెల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు దృష్టికి రైతాంగ సమస్యలు తీసుకెళ్ళాలి

విశాలాంధ్ర -భీమవరం: ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోకి బుధవారం విచ్చేస్తున్న చంద్రబాబు దృష్టికి రైతాంగ సమస్యలను తీసుకురావాలని పశ్చిమగోదావరి జిల్లా తెలుగు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మినేడి నాగేశ్వర రావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం భీమవరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో వరి ,ఆక్వా, ఇతర వాణిజ్య పంటల రైతులు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నా రన్నారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరుగుతున్నాయని రైతులు ఇబ్బందులు పడుతున్నారని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. 30వ తేదీ ఉదయం 11 గంటలకు పెదవేగి మండలం విజయరాయి గ్రామానికి రైతులు, పార్టీ కార్యకర్తలు, యువజన విభాగం, మహిళలు, బీసీ సాధికారిక కమిటీ సభ్యులు, ఇతర అనుబంధాల సంఘాలకు చెందిన వారందరూ హాజరు కావాలని, చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించే పలు అవగాహన సదస్సులకు చంద్రబాబు నాయుడు హాజరవుతారని, వాటన్నిటినీ విజయ వంతం చేయాలని తమ్మినేని నాగేశ్వరరావు కోరారు.

చంద్రబాబు పర్యటనకు భారీ ఏర్పాట్లు

విశాలాంధ్ర - లింగపాలెం : తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చింతలపూడి పర్యటనకు వస్తున్న సందర్భంగా నాయకులు, కార్యకర్తలు భారీస్థాయిలో స్వాగత ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గం ప్రారంభమయ్యే వలసపల్లి అడ్డరోడ్డు వద్ద నుంచి ఫ్లెక్సీలు చింతలపూడి వరకు ఏర్పాటు చేశారు. చంద్రబాబు పర్యటన ధర్మాజీగూడెం, మఠంగూడెం, లింగపాలెం గ్రామాల మీదుగా చింతలపూడికి చేరుకుంటుంది. ధర్మాజీగూడెం, మఠంగూడెం, లింగపాలెంలలో చంద్రబాబు ప్రసంగం ఉండడంతో నాయకులు ఏర్పాట్లు చేశారు. ఈ పరిధిలో వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు వచ్చేందుకు వాహన సదుపాయాలు కల్పించారు. నియోజకవర్గానికి చంద్రబాబు వస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని టికెట్లు ఆశిస్తున్న ఆశావహులు భారీ కటౌట్‌లు పోటాపోటీగా ఏర్పాటు చేశారు. చంద్రబాబు పర్యటన విజయవంతం చేయాలని మండలానికి చెందిన నాయకులు మోరంపూడి మల్లికార్జునరావు, పెదబాబు, గరిమెళ్ళ చలపతి, చెరువుగట్టు రామ్మోహన్‌రావు, ముసునూరు రాము, పిల్లల శ్రీనివాస్, పల్లె శ్రీను తదితర నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీ మంత్రి పీతల సుజాత, మాగంటి బాబు వలసపల్లి వద్ద స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేశారు. ఈ ప్రాంతమంతా పసుపుమయం చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

విశాలాంధ్ర-ముసునూరు: ఆల్ ఇండియా స్పోర్ట్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో తమ గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ డి.రోజ్‌లక్ష్మికుమారి పేర్కొన్నారు.ముసునూరు మండల గురుకుల పాఠశాల విద్యార్థులు కె.శ్రీవల్లి,ఎం.శ్రావణి, జె.మహాలక్ష్మి,ఎల్.నరిన్ జె.హారిక ఎంపికకావడంతో ఆ విద్యార్థులతో పాటు వారికి తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను కూడా అభినందించారు.

గుండెపోటుతో రంగస్థల కళాకారుడు మృతి

విశాలాంధ్ర - పాలకొల్లు : పాలకొల్లు మండలం పెద మామిడిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ రంగస్థల కళాకారుడు కడలి వెంకట నరసింహారావు మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. నరసింహారావు కళాకారుడిగా పలు ప్రధాన పాత్రలలో నటించి, అద్భుతమైన నటనా చాతుర్యం ప్రదర్శించి అందరినీ మెప్పించారు. ఆయన మరణంతో పెద మామిడిపల్లి ప్రజలు, మృతుడి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

అగ్రిగోల్డ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు కోనాల భీమారావు

విశాలాంధ్ర- భీమవరం : అగ్రిగోల్డ్ యాజమాన్యం ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని డిసెంబర్ ఆఖరుకి బాధితులందరికీ డిపాజిట్లను వడ్డీతో సహా చెల్లించాలని, మృతి చెందిన బాధితుల కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా అగ్రిగోల్డ్ బాధితులు భీమవరం ప్రకాశం చౌక్ వద్ద చేపట్టిన ధర్మాగ్రహ నిరాహారదీక్షలకు రెండోరోజు మంగళవారం భీమారావు సంఘీభావం తెలిపి మాట్లాడుతూ గత ఎనిమిదిన్నర సంవత్సరాలుగా అగ్రి బాధితులు న్యాయం కోసం ఎదురు చూస్తున్నారని పాలకులు పట్టించుకోకుండా గాలికొదిలేయడం దారుణమని విమర్శించారు. అగ్రి బాధితుల సమస్యను తీరుస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఓట్లేయించుకున్న జగన్ గద్దెనెక్కేక మడమ తిప్పాడని కోనాల దుయ్యబట్టారు. 10,20 వేలు డిపాజిట్లను చెల్లిస్తామని కమిటీల మీద కమిటీలు వేసి కొందరికే ఇచ్చారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం దారుణమని బాధితులను మోసం చేసిన అగ్రిగోల్డ్ యాజమాన్యాన్ని శిక్షించకుండా కాలయాపన చేస్తుందని కోనాల పేర్కొన్నారు. సీపీఐ భీమవరం పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి వై.నాగలక్ష్మి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలు గడిచినా నేటికీ పూర్తి న్యాయం చేయలేదన్నారు. నిరాహార దీక్షల్లో అసోసియేషన్ మహిళా రాష్ట్ర కార్యదర్శి వై.నాగలక్ష్మి, భీమవరం శాఖ కార్యదర్శి కె.గోపాలకృష్ణ, జి.కొండయ్య, పి.నరశింహాచారి, మాకిరెడ్డి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు,మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, సిపిఐ నాయకులు ఆకల రాము, దుబాయ్ శ్రీను తదితరులు ధర్మాగ్రహ నిరాహారదీక్షలకు సంఘీభావం తెలిపారు.

నిర్వాసితులకు న్యాయం చేయని ప్రభుత్వం

విశాలాంధ్ర - వేలేరుపాడు : పోలవరం ప్రాజెక్టు వలన సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు ప్రభుత్వం ఏ విధంగా న్యాయం చేయడం లేదని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కారం దారయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గిరిజన సంఘం నాయకులతో మంగళవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరి వరదలను ఆసరా చేసుకుని ముంపు గ్రామాల ప్రజలను మభ్యపెట్టి ఉపాధి లేని ఊరికి తరలించి వారిని కష్టాల్లోకి నెట్టారని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. పునరావాస ప్రాంతాలకు నిర్వాసితులను తరలించే నాటికి అక్కడ ఉపాధి కల్పించకుండా తరలించడం వలన ఆయా కుటుంబాలు ఎలా జీవిస్తాయని ప్రశ్నించారు. కనీస అవగాహన లేకుండా పోలవరం నిర్వాసితుల విషయంలో ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాల వలన సర్వం కోల్పోతున్న ముంపు ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వర్ణనాతీతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో నిర్వాసితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పూర్తిస్థాయిలో తెలుసుకొని వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్, గిరిజన సంఘం నాయకులు మడివి కామయ్య, కట్టి గోపాలరావు, పిట్టా వీరయ్య, కరటం వెంకటేశ్వర్లు,కారం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం భోజన కార్మికుల మెస్ చార్జీలు పెంచాలి

విశాలాంధ్ర - ఏలూరు : జగనన్న గోరుముద్ద, మధ్యాహ్నం భోజన వంట ఏజెన్సీ కార్మికుల మెస్ చార్జీలు వెంటనే పెంచాలని ఏఐటీ యూసీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీ కార్మికుల సమస్యలను పరిష్కరించా లని కోరుతూ మంగళవారం ఏలూరు జిల్లా విద్యాధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలోని సహాయ సంచాలకులు ఎండి షరీఫ్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చాట్ల పుల్లారావు, కంకిపాటి బుచ్చిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వంట ఏజెన్సీల మెస్ చార్జీలు పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రస్తుతం మధ్యాహ్నం భోజనం లో ఉన్న మెనూ మార్పులు చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఏలూరు జిల్లా నాయకులు తొర్లపాటి బాబు, వి. వర ప్రసాద్, ఎం. దుర్గ, వెంకటేశ్వరమ్మ సుహాసిని ,పగడాలు లక్ష్మి ,సుజాత తదితరులు పాల్గొన్నారు.

చనుబండలో రూ.12 కోట్లతో అభివృద్ధి

విశాలాంధ్ర - చాట్రాయి : జగన్మోహన్ రెడ్డి పాలన పేద ప్రజల పాలనంటూ నూజివీడు శాసనసభ్యులు ప్రతాప్ అప్పారావు కొనియాడారు. మంగళ వారం చాట్రాయి మండలంలోనే అతిపెద్ద గ్రామమైన చనుబండలో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. గడపగడపకు వెళ్ళి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. 3ఏళ్ళ జగన్ పాలనలో చనుబండ గ్రామంలో సుమారు రూ.12కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో ఎపి కోపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవ రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు మిద్దే బాలకృష్ణ, మండలపరిషత్ ఉపాధ్యక్షులు పుచ్చకాయల సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు చెలికాని బాబ్జి, చనుబండ సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, రామకృష్ణ, చిన్నబాబు, వాసు, మోరంపూడి నాగేశ్వరరావు, జల్లేపల్లి పరమేశ్వరరావు, పరసా చెన్నారావు, చింతా శ్రీను, ములగలపాటి శ్రీను, వంకిని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూ రక్ష భూ సర్వే

- జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర- ఏలూరు : జిల్లాలో జగనన్న భూరక్ష, భూ సర్వే కార్యక్రమం పారదర్శకమైన రీతిలో పటిష్టంగా నిర్వహించేందుకు గాను కమాండ్ కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లో మంగళవారం సర్వే సిబ్బందికి లాప్ టాప్ లు, హార్డ్ డిస్క్ లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎటువంటి వివాదాలు లేని భూముల వివరాలు జగనన్న భూరక్ష, భూ సర్వే ద్వారా సాధ్యమన్నారు. భూ సర్వే కార్యక్రమం పటిష్టంగా సాగేందుకుగాను కమాండ్ కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా భూ సర్వే పనులను పర్యవేక్షించడంతో పాటు, క్షేత్ర స్థాయిలో ఏర్పడే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు వీలు కలుగుతుందన్నారు. భూ సర్వేలో గుర్తించిన భూముల సర్వే వివరాలను డివిజన్ స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసి ఆన్ లైన్ లో పొందుపరచనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమం లో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. అరుణ్ బాబు, ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్, సర్వే శాఖ సహాయ సంచాలకులు టి. వెంకటేశ్వరరావు, సర్వే శాఖ డిప్యూటీ ఇన్స్పెక్టర్ టి.బి.ఎస్.వి. రమణా రావు, సి.హెచ్. శ్రీనివాసరావు, జిల్లా కో ఆర్డినేటర్ ఎన్. వెంకటేశ్వరరావు, బి. శ్రీరామ్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు భూ హక్కు పత్రాల అందజేత



విశాలాంధ్ర -నూజివీడు : రైతాంగం సరిహద్దు సమస్యలు లేకుండా కలిసి కట్టుగా ఉండాలనే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమం జగనన్న శాశ్వత భూహక్కు పథకం అని నూజివీడు శాసన సభ్యులు మేక వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. మంగళవారం మర్రిబంధం, సీతారామపురం గ్రామాల రైతులకు భూ హక్కు పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పథకంలో రైతులకు పార్టీలతో పనిలేదన్నారు. త్వరలోనే అన్ని గ్రామాలలో భూ సర్వే పూర్తి చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ప్రజల కోసం ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. ప్రజా సమస్యలు సచివాలయాలలోనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో రెవెన్యూ, అటవీ భూముల సమస్యలు ఉన్నాయని త్వరలో వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్ర మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యత ఇస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణంరాజు,తహశీల్దార్, సర్పంచులు పాల్గొన్నారు.

దర్భరేవు కంపెనీ భూములకు పట్టాలు పంపిణీ

విశాలాంధ్ర - నరసాపురం : దర్భరేవు కంపెనీ భూముల పట్టాలు పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నవంబర్ 21న నరసాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లాంచనంగా ప్రారంభించారు. దీనికి కొనసాగింపుగా శనివారం నరసాపురం మండలం ధర్భరేవు గ్రామంలో 1,623 మంది రైతులకు 1,754 ఎకరాల కంపెనీ భూముల రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రభుత్వ చీఫ్ విప్, జిల్లా కలెక్టరు కలసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద రాజు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఎంతో ఖరీదైన భూములకు సర్వ హక్కులు ఇవ్వటంతో పాటు రిజిస్ట్రేషన్ కు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా రైతులకు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇచ్చిన భూములకు లబ్ధి దారులకు సర్వ హక్కులు ఉంటాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు.జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి మాట్లాడుతూ ప్రజలు, లబ్ధి దారులు ఎన్నో ఏళ్ల కోరిక నెరవేరిందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టరు జె వి మురళి, సబ్ కలెక్టరు ఎం. సూర్య తేజ, తహశీల్దారు యస్ యం ఫాజిల్ , జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధా కృష్ణ, ఎంపీపీ మైలా బత్తుల సోనీ,గ్రామ నాయకులు, తది తరులు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లా డీపీవోగా మల్లికార్జునరావు

విశాలాంధ్ర- ఏలూరు : ఏలూరు జిల్లా పంచాయతీ అధికారిగా జివికె మల్లికార్జునరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మల్లికార్జున రావు ప్రస్తుతం డ్వామా ఏపీవోగా పనిచేస్తూ జిల్లా పంచాయతీ అధికారిగా పూర్తి అదనపు ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేసిన నిమ్మగడ్డ బాలాజీకి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

రాష్ట్రంలో అసమర్ధ ప్రభుత్వం

విశాలాంధ్ర -నూజివీడు : రాష్ట్రంలో అబద్దాల ముఖ్యమంత్రి ,బాధ్యత లేని మంత్రులు అసమర్థత ప్రభుత్వాన్ని నడుపుతున్నారని రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షులు మర్రిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ పరశీలకుడు బొడ్డు వేణుగోపాలరావు అన్నారు. నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ప్రారంభానికి ఉద్దేశించి టిడిపి శ్రేణులను సమాయత్తం చేసేందుకు నూజివీడు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత మూడున్నర సంవత్సరాలుగా అసమర్థత ముఖ్యమంత్రి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని ఆయన పాలన పుణ్యమా అని ఉద్యోగులు వ్యాపారులు రైతులు కూలీలు అందరూ ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే పరిస్థితి వచ్చింది అన్నారు. ఈ సందర్భంగా నూజివీడు మండల పార్టీ అధ్యక్షులు ముసునూరు రాజా, నూజివీడు పట్టణ పార్టీ అధ్యక్షులు మలి శెట్టి జగదీష్, ముసునూరు మండల పార్టీ అధ్యక్షులు దేవినేని డేలరాం, ఏలూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, ఆగిరిపల్లి మండల పార్టీ అధ్యక్షులు మల్లవల్లి కోటేశ్వరరావు తదితరులు ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి నూజివీడు నియోజకవర్గం నుండి 1000 బైకులు, కార్లు, ఆటోలు ట్రాక్టర్లు ఇతర వాహనాలతో భారీ ర్యాలీగా వెళ్లి కలపర్రు టోల్గేట్ వద్ద చంద్రబాబునాయుడు ఘన స్వాగతం పలుకుతామన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల,పట్టణ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

శ్రీసుబ్రహ్మణ్యేశ్వర షష్టి వార్షిక మహోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - ముదినేపల్లి : సింగరాయపాలెం చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం 68వ వార్షిక షష్టి కల్యాణ మహోత్సవాలు మంగళవారం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ వెంకటేశ్వరమ్మ దంపతులు పుట్టలో పాలు పోసి లాంఛనంగా ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయానికి విచ్చేసిన ఈ దంపతులను ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, చైర్మన్ శౌంటి నాగరాజు, ట్రస్టు సభ్యులు, అర్చక బృందం ఆలయం మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎంపిపి రామిశెట్టి మాట్లాడుతూ పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం కమిటీ విస్తృత ఏర్పాట్లు చేశారన్నారు. ఈ ఉత్సవాలు డిసెంబర్ 10 వరకు కొనసాగుతాయన్నారు. మొదటిరోజు భక్తులు పుట్టలో పాలు పోసి స్వామివారి దర్శనం కోసం క్యూ లైన్‌లో బారులు తీరారు. వచ్చిన అతిథులను స్వామి వారి శేష వస్త్రం , చిత్రపటం , ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధ, బోయిన విమల రామరాజు, కోమటి విష్ణువర్ధన్, ఆలయ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

విశాలాంధ్ర - భీమవరం టౌన్ : గ్రామాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం భీమవరం మండలంలోని కోమటి తిప్ప నార్త్ గ్రామంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గడపగడపకు తిరిగి గత మూడేళ్ల పాలనలో ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ప్రజల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడానికి ముఖ్యమంత్రి జగన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. అన్ని శాఖల అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటు న్నారని, తద్వారా ప్రజలు వివరించిన సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, జెడ్పీటీసీ సభ్యులు కాండ్రేగుల నరసింహారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరు మా ని ఏడుకొండలు, గ్రామ సర్పంచ్ అల్లూరి శ్రీహరి రాజు, ఎంపీపీ సత్తినేని మోహన్ రావు, నడింపల్లి రామకృష్ణంరాజు, పెనుమత్స సాయి రాజు, ఇరుసుమండ నాగేశ్వరరావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

డిసెంబరు 1న బీసీల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: డిసెంబర్ 1వ తేదీ గురువారం జంగారెడ్డిగూడెం శివారు లోని కరాటం వై జంక్షన్ వద్ద ఉన్న దండమూడి వశిష్ట ఏసీ కళ్యాణ మండపంలో ఉదయం గం.9లకు టిడిపి అధినేత,మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి శ్యామ్ చంద్ర శేషు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సమావేశం జరగబోయే మండపాన్ని టీడీపీ బీసీ నాయకులు సందర్శించారు. ఈ ఆత్మీయ సమావేశానికి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి బిసి కులాల నేతలు, బీసీలంతా హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని, రానున్న ఎన్నికల్లో బీసీలకు చేయబోయే కార్యక్రమాలు, డిమాండ్లు తదితర విషయాలపై, బీసీల అభివృద్ధికి తెలుగుదేశం చేస్తున్న కృషి పై అక్కడ చర్చిస్తారని తెలిపారు.ఈకార్యక్రమంలో బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, పట్టణ ప్రధానకార్యదర్శి తూటికుంట రాము, మండల బీసీసెల్ అధ్యక్షుడు బూసా సత్యనారాయణ రెడ్డి, పట్టణ బీసీసెల్ అధ్యక్షుడు పకనాటి అంజి, తెలుగుయువత అధ్యక్షుడు కోనేటి చంటి, అధికార ప్రతినిధి గెడ సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: జంగారెడ్డిగూడెంలో డిసెంబరు 1వ తేదీన జరిగే బీసీల ఆత్మయ సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. వీరభద్ర వరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం శివారు కరాటం వై జంక్షన్ వద్ద గల దండమూడి రామలక్ష్మి ఏసీ కళ్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు బీసీల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలియజేశారు.ఈ ఆత్మీయ సమావేశానికి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి బీసీలంతా హాజరయ్యి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. రానున్న ఎన్నికల్లో బీసీలకు చేయబోయే మేలు డిమాండ్లు తదితరు విషయాలపై బీసీల అభివృద్ధికి తెలుగుదేశం చేస్తున్న కృషి గురించి సమావేశంలో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

కైకరం గ్రామాలలో షష్ఠి వేడుకలు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కైకరం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి వేడుకలు శ్రీ నాగమ్మ ఆలయంలో మంగళవారం వైభవంగా ప్రారంభ మయ్యాయి. తెల్లవారుజాము 2:09 గంటలకు స్వామివారి కళ్యాణంతో ఉత్సవాలు ప్రారంభ మయ్యాయి. ఉంగుటూరు జెడ్పిటిసి సభ్యురాలు కొరి పల్లి జయలక్ష్మి శ్రీనివాసరావు దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు,. కళ్యాణం అనంతరం భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. రాష్ట్రవ్యాప్త ఖ్యాతి గాంచిన కైకరం షష్ఠి వేడుకలకు ఉభయగోదావరి జిల్లాల నలుమూలల నుండి భక్తులు షష్ఠి ఉత్సవాలకు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. తహసీల్దార్ రమణారావు పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది, కైకరం గ్రామపంచాయతీ సిబ్బంది సచివాల సిబ్బంది, పుప్పాల గోపి, శానం బాబ్జి , యెగ్గిన వెంకయ్య నాయుడు, తదితరులు పర్యవేక్షించారు. గణవరం సిఐ సుభాష్ ఆధ్వర్యంలో నలుగురు ఎస్సైలు, 94 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. భక్తుల దర్శనానికి వెళ్ళే క్యూలైన్ల వద్ద గ్రామస్థులు, దాతలు భక్తులకు ఉచితంగా పాలను అందజేసారు.

గుమ్మలూరు లో వైభవంగా షష్ఠి ఉత్సవాలు

విశాలాంధ్ర- పోడూరు : మండలంలోని గుమ్మలూరు లోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త పెన్మెత్స వెంకట నర్సింహా రాజు శకుంతల దంపతులు సోమవారం రాత్రి కళ్యాణం నిర్వహించగా మంగళవారం లక్ష్మీ గణపతి హెూమము సుబ్రమణ్య హెూమము చండీ హెూమము జరిపారు. ఆలయం వద్దకు ఉదయం నుండే గుమ్మలూరు పెనుమదం రావిపాడు వద్దిపర్రు గ్రామాల భక్తులు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయం వద్ద పెద్ద ఎత్తున తీర్థం జరిగింది. మండలంలోని వేడంగి మట్టపర్రు జిన్నూరు గ్రామాలలో సుబ్రమణ్య స్వామి ఆలయాల వద్ద షష్ఠి ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

భవిత సెంటర్‌లో దివ్యాంగులకు ప్రతిభా పోటీలు

విశాలాంధ్ర- ముసునూరు: డిసెంబరు 3వ తేదీన జరిగే అంత ర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రమైన మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి, ప్రధానోపాధ్యా యులు హెచ్.హెూన్నమణీ ఆధ్వర్యంలో ఆటల పోటీలు, వకృత్వం. జికె టేస్టులు నిర్వహించి ,వారిలో ప్రతిభ కనబర్చిన వారికి డిసెంబ రు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజున బహుతులు అందచేయనున్నట్టు ఉపాధ్యాయులు డిఎంఎల్‌వి లక్ష్మినారాయణ, జె.నాగమల్లేశ్వరి తెలిపారు.

ఉద్యోగం కల్పించండి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : బిడ్డను పోగొట్టుకున్న తమకు ఇద్దరిలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అరుణ్ బాబుకు కానుమూరి జ్యోతి, శేఖర్ దంపతులు విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. పొంగుటూరు గ్రామా నికి చెందిన జ్యోతి, శేఖర్ దంపతుల కుమారుడు కనుమూరి చరణ్ తేజ తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతూ ఉండగా పాఠశాల దగ్గరలో ఉన్న చెరువులో పడి మృతి చెంది శవమై తేలిన సంఘటన విధితమే. అనంతరం జరిగిన పరిణామాలలో అప్పటి పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ అంబేద్కర్, ఆర్డిఓ, ద్వారా బిడ్డను పోగొట్టుకున్న దంపతులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పొంగుటూరు గ్రామ సచివాలయం వద్ద ప్రభుత్వ కార్యక్రమానికి హాజరైన ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ అరుణ్ బాబుకు జ్యోతి, శేఖర్ దంపతులు వినతి పత్రాన్ని అందజేశారు. వారితో జాయింట్ కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ మండలంలో అంగన్వాడి కేంద్రాలలో ఉద్యోగాలకు అవకాశం ఉన్న లేక జిల్లాలో ఖాళీ ఉన్నచోట వెరిఫికేషన్ చేసి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

వీధి బాలల గుర్తింపుపై దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర - ఏలూరు : ఎలాంటి ఆధారం లేకుండా వీధుల్లో తిరిగే బాలలు, తల్లిదండ్రులతో పాటు రోడ్డు ప్రక్కన తిరిగే బాలలను గుర్తించి వారి శ్రేయస్సుకు పాటుపడాలని ఇందుకు గ్రామ, మండలస్థాయిలో రిస్క్యూ బృందాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షే మం, జిల్లా బాలల సంరక్షణ యూనిట్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన సమావేశంలో వీధిబాలల పరిస్థితులుపై పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వీధి బాలలను, బిక్షాటన చేస్తున్న బాల లను, తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి గురిఅవు తున్న బాలలను గుర్తించి ప్రత్యేక హెూమ్ లో ఉంచా లన్నారు. వారి విద్య కొనసాగింపుకు, వారికి అవసరమైన ఆధార్ తదితర మౌలిక సౌకర్యాలను కల్పించాలన్నారు. బాలల మెరుగైన భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. ప్రత్యేకించి ఫోక్సో బాల్య వివాహాలు, ఇతర కారణాలతో రిస్క్యూ చేసిన బాధిత బాలికలకు పునరావాసం కల్పించేందుకు అవసరమైన నియమాలను రూపొందించి ప్రత్యేక హెూమ్ నిర్వహిం చేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి కె.ఎ.వి.ఎల్ పద్మావతి, జిల్లా విద్యాశాఖా ధికారి ఆర్.ఎస్. గంగాభవాని, డిఎంఅండ్ హెచ్ ఓ డా. బి. రవి, సోషల్ వెల్ఫేర్ జెడి ఎస్. మధుసూధనరావు, సిడబ్ల్యుసి చైర్ పర్సన్ బి. రిబ్కారాణి, అడిషనల్ మున్సిపల్ కమీషనరు సిహెచ్ బాపిరాజు, కార్మికశాఖ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జి. వెంకట రమణ, డిసిపిఓ డా. సిహెచ్ సూర్యచక్రవేణి, జిల్లా ప్రొబిషన్ ఆఫీసరు జె. సత్యవతి, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానియేల్, రైల్వే ఎఎస్ఐ పి. సైమన్, ఎస్పీ కార్యాలయం ఎస్ఐ ఎస్. రామానాయుడు, ఇన్‌చార్జి డిసిహెచ్ డాక్టర్ పి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే పోలవరం పూర్తి చేస్తాం

- మాజీ మంత్రి దేవినేని ఉమ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అధికారంలోకి రాగానే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని మాజీమంత్రి దేవినేని ఉమ తెలిపారు స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ వద్ద మంగళవారం టిడిపి మండల ఉపాధ్యక్షులు నిమ్మగడ్డ రవీంద్రనాథ్ అధ్యక్షతన కొయ్యలగూడెం మండల నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దేవినేని ఉమ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రభుత్వం ద్వారా అందజేసే వివిధ పత్రాలపై ఆయన ఫోటో ముద్రించడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో ప్రతి గ్రామంలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని వాటిని పరిష్కరించకుండా తమ సొంత పథకాలను ప్రవేశపెట్టి ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గం ఇంచార్జ్ బొరగం శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిట లాడిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు

విశాలాంధ్ర - కలిదిండి: సుబ్రహ్మ ణ్యేశ్వర షష్ఠి పురస్కరించుకొని స్వామి వారి ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. మంగళ వారం మండలంలోని వెంకటాపురం, కాళ్ళ పాలెం,కోరుకొల్లు, పెదలంక గ్రామం లోని కొలువై ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ నాగేశ్వర స్వామి, శ్రీ వల్లి దేవసేన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక షష్ఠ మహెూత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామునుంచే భక్తులు స్వామివారి పుట్ట వద్దకు చేరుకొని పూజలు నిర్వహించి పుట్టలో పాలు పోసి,కోడిగుడ్లు వేసి పసుపు కుంకాలతో పూజలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు భక్తులకి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. పెద్ద లంక లో ఆలయ చైర్మన్ ఐనాల. సత్యనారాయణ, ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలో పోకల తాతారావు కుమారుడు శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వెంకటాపురంలో సర్పంచ్ గూడవల్లి శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.యం పి పి ఉమ, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఐనాల. బ్రహ్మజీ, సర్పంచ్ మోకా. లక్ష్మి, వైస్ ఎంపీపీలు స్వామివారిని దర్శించుకున్నారు.

ఏఎన్‌ఎంకు రూ.10వేల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కొయ్యలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో బోడిగూడెం సచివాలయంలో ఏఎన్ఎం గా విధులు నిర్వహి స్తున్న పి.దుర్గా ప్రశాంతి ఎప్పటిలాగానే విధులకు హాజ రవుతుండగా మార్గమధ్యలో తన స్కూటీని లారీ ఢీ కొనడంతో తన రెండు కాళ్లు నుజ్జు నుజ్జు కావడంతో కొయ్యలగూడెం లో ప్రైవేటు ఆసుపత్రిలోని ఆమె రెండు కాళ్ళను తొలగించిన విషయం విధితమే. విషయం తెలుసుకున్న నల్లజర్ల మండలం చీపురుగూడెం గ్రామానికి చెందిన ప్రొఫెసర్ వసంతాడ ఆనంద స్వరూ తన మిత్రులతో కలసి దుర్గా ప్రశాంతిని పరామర్శించి ఆమెకు రూ10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జొన్నకూటి ప్రమోద్ కుమార్, రాచర్ల అబ్బులు, పి. ఆశ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఓటు హక్కు పై అవగాహన

విశాలాంధ్ర - భీమడోలు : స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా భీమడోలు గ్రామంలోని శ్రీవెంకటేశ్వర కళాశాలలో అర్హులైన విద్యార్థులకు ఓటు హక్కు పొంద వలసిందిగా ప్రోత్సహిస్తూ, విద్యార్థుల వద్ద నుంచి ఫారం 6 లను తహశీల్దార్ జాన్ రాజు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాఘ వన్, ఆర్ఐ కిరణ్ కుమారి, కాలేజీ ప్రిన్సిపాల్ రాము, తదితరులు పాల్గొన్నారు.

ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమానికి ప్రతి కార్యకర్త తరలిరావాలి

విశాలాంధ్ర- నూజివీడు టౌన్ : జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో తిరోగమనంలో ప్రయాణిస్తున్న నేపథ్యంలో టిడిపి చేపట్టిన ఇదేమి కర్మ రాష్ట్రానికి ప్రారంభ కార్యక్రమం ఏలూరు జిల్లా , విజయరాయి గ్రామంలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు బుధవారం ప్రారంభిస్తున్నందున నూజివీడు నియోజకవర్గం నుండి ప్రతి టిడిపి కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని టిడిపి సీనియర్ నాయకులు కాపా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాపా మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రాభివృద్ధి 30 ఏళ్ల వెనక్కు వెళ్లిపోయిందన్నారు. కార్మికులు పనులు లేక వలసల పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు.

తలుపు తట్టి.. వైద్యం

విశాలాంధ్ర - పెనుమంట్ర : మార్టేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గ్రామాల్లోని ఇళ్ల వద్దకు డాక్టర్లు నేరుగా వెళ్లి తలుపు తట్టి నాడిపట్టి వైద్యం అందిస్తున్నామని డాక్టర్ కె. కార్తీక్ అన్నారు. ఈ విధానం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువ అవుతాయని తెలిపారు. మంగళవారం మార్టేరు సచివాలయం - 2 పరిధిలోని శివరావుపేట లో క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపులో జనరల్ ఓపి, గర్భిణీ స్త్రీ సేవలు, బాలింతలు సేవలు, కౌమార దశ బాలికలు సేవలు, బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అంగన్వాడి సెంటర్ లోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగు చికిత్సలు చేశారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకుని చికిత్స అందించి తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డాక్టర్ చావీర్, 104 అధికరణ డాక్టర్ గుడిమెట్ల అనూష ,ఎఎన్ఎం బి. సుజాత,ఆశా వర్కర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన మురళీధరన్

విశాలాంధ్ర - భీమవరం : కేంద్ర విదేశీ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి, ప్రవాస్ యోజన ఏపీ పరిశీలకులు మురళీధరన్ మంగళవారం భీమవరం పట్టణంలో కేంద్ర నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు.తొలుత భీమవరం చేరుకున్న కేంద్రమంత్రి పాస్ పోర్ట్ సేవా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంలో ఇన్ ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి దాసిరాజు, విశాఖపట్నం అసిస్టెంట్ పాస్ పోర్ట్ అధికారి భాస్కరరావు, గ్రాంటింగ్ అధికారి ఫణి కుమార్ లు కేంద్రమంత్రికి స్వాగతం పలికారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై కేంద్ర మంత్రి ఆరా తీశారు. స్థానికంగా కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసినటువంటి రైల్వే డబ్లింగ్ అండర్ పాస్ పనులను, రైల్వే క్వార్టర్స్ ను పరిశీలించారు. భీమవరం పట్టణంలోని గునుపూడి 11, 12 వార్డులలో కేంద్ర ప్రభుత్వ సాయంతో నిర్మించిన టిడ్కో ఇళ్లను కేంద్రమంత్రి మురళీధరన్ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తో కలిసి పరిశీలించారు. టిడ్కో గృహ లబ్ధిదారులతో ముఖా ముఖి కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ పి యు.రవి ప్రకాష్, ఇన్చార్జి డిఆర్ఓ దాసిరాజు, టిడ్కో ఈఈ ఎం.యస్. స్వామి నాయుడు, మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, తహసీల్దార్ రవికుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డీఏ బకాయిలు చెల్లించాలి

విశాలాంధ్ర - గోపాలపురం : ఉపాధ్యాయులు వృత్తితో పాటు, సంఘ కార్యక్రమాలలో బాధ్యతాయుతంగా వ్యవహరిం చాలని తూర్పుగోదావరి జిల్లా యుటిఎఫ్ శాఖ గౌరవ అధ్యక్షుడు శంకరుడు తెలిపారు. మంగళవారం స్థానిక జేబీ స్కూల్ ఆవరణలో గోపాలపురం ఉపాధ్యాయ యూటీఎఫ్ మండల శాఖ ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా గౌరవాధ్యక్షుడు, శంకరుడు, యేసు బాబు కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శంకరుడు మాట్లాడుతూ ఉపాధ్యాయు లకు రావలసిన డిఏ బకాయిలను చెల్లించాలని పిఎఫ్, ఇన్సూరెన్స్ బకాయిలను త్వరలో పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం యుటిఎఫ్ గోపాలపురం మండల శాఖ గౌరవ అధ్యక్షుడిగా జి.వెంకటేశ్వరరావు అధ్యక్షులుగా జి.రవి, ప్రధాన కార్యదర్శిగా ఎ. జానుబాబు, ఉపాధ్యక్షులుగా ఎం.నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షులు కె .ఝాన్సీరాణి, కోశాధికారి సీహెచ్.సూర్యచంద్రం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఘనంగా షష్ఠి మహెూత్సవం

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : కపిలేశ్వరపురం మండలం సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోన సీమ జిల్లాలోని, కపిలేశ్వరపురం

మండలం అంగర లో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం సర్వాంగ సుంద రంగా షష్ఠి ఉత్సవా లకు సిద్ధమైంది, కపిలేశ్వరపురం గోదావరి చెంతన ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అంగరలో భక్తుల తాకిడితో రద్దీగా మారింది. సుబ్రహ్మణ్య షష్ఠి రోజున స్వామివారిని దర్శించుకుంటే సర్వాభిష్టాలు నెరవేరుతాయని భక్తులు నమ్ముతారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతు 28/11 /22 నుండి 3/12/22 వరకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. షష్ఠి రోజున కను విందు చేసే బాణసంచా కార్యక్రమం ఉంటుందని భక్తులు అందరూ తప్పకుండా వీక్షించాలని కోరారు..ఈ మహెూత్సవాలకు అంగర పోలీస్ స్టేషన్ వారు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేశారు.

ఘనంగా షష్ఠి మహెూత్సవం

విశాలాంధ్ర-ఏలేశ్వరం : శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి వారి షష్ఠి మహెూత్సవం ఘనంగా నిర్వహించారు. ఏలేశ్వరం సాయిబాబా మెట్టపై వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవాలయంలో సోమవారం రాత్రి స్వామివారి కల్యాణ మహెూత్సవాన్ని నిర్వహించి మంగళవారం ఉదయం నాలుగు గంటల నుండి ప్రత్యేక పూజలు అభిషేకాలు ఆలయ అర్చకులైన ఐలూరి సాయి సుబ్రహ్మణ్య శర్మ, చంద్రమౌళి కుమారస్వాములు నిర్వహించారు. దీంతో మెట్ట పూర్తిగా భక్తులతో నిండిపోయింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సాయి శర్మ మాట్లాడుతూ షష్ఠి రోజున సోమవారం దర్శించుకుంటే సకల దోషాలు హరించిపోతాయని అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అవసాకార్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

షష్ఠి వేడుకలు

విశాలాంధ్ర - తాళ్ళపూడి : సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి సందర్భంగా తాళ్ళపూడి మండలం లోని పలు గ్రామాల్లో షష్ఠి వేడుకలు మంగళ వారం ఘనం గా జరిగాయి భక్తులు ఉదయం నుండే ఆలయాలను దర్శించు కున్నారు. పెద్దేవం లో చెరువు సెంటర్లో గల సుబ్రహమణ్యేశ్వర స్వామి ఆలయం లో ప్రతేక పూజలు చేశారు. గెడ్డం కుటుంబీకులు స్వామి కి వెండి తాపదాన్ని బహుకరించారు. తాళ్ళపూడి లోని బస్టాండ్ వద్ద ఆలయం లో సోమవారం రాత్రి స్వామి వారికి కళ్యాణం జరిపి మంగళ వారం ఉత్సవాన్ని నిర్వహించారు. ప్రక్కిలంక గ్రామం లో అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం లో గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం లో, వేగేశ్వరపురం శివాలయం వద్దగల సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో కళ్యాణ ఉత్సవాన్ని నిర్వహించారు.

పొలిమేరు శ్రీ వల్లి నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహెూత్సవములు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామ శివారున పోలవరం కాలువ గట్టు ప్రక్కన వేంచేసియున్న పొలిమేరు శ్రీ వల్లి నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్ఠి మహెూత్సవములు మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు చంద్రమౌళి సుబ్బారావు శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అభిషేకములు నిర్వహించారు. అనంతరం గండేపల్లి శ్రీ విద్ వరేణ్య ఆశ్రమ గురువు ప్రసాద్ గురువుచే హెూమములు జరిపించారు. అనంతరం భారీ స్థాయిలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని, స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ జెడ్‌పిహెచ్ స్కూల్ సందర్శన

విశాలాంధ్ర - కరప : తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ షేక్ షాబ్జీ కరప జిల్లా పరిషత్ హైస్కూల్‌ను మంగళవారం సందర్శించారు. తెలుగు బోధించే ఉపాధ్యాయుని సస్పెండ్ చేయడం ఉపాధ్యాయ సంఘాలు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని యుటిఎఫ్ నాయకులుతెలిపారు. ఈ విషయమై వచ్చిన ఆయన మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు లీలా మనోహర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుని తప్పు లేకపోయినప్పటికీ, తల్లిదండ్రులు ఫిర్యాదు చేయకపోయినా ఉపాధ్యాయుని సస్పెండ్ చేయడం జరిగిందని దీనివలన ఆ సబ్జెక్టులో విద్యార్థులు వెనకబడి పోతున్నారని తెలపడంతో ఆయన అధికారులు అత్యుత్సాహంగా కనబడుతుందని, వెంటనే సస్పెండ్ ఎత్తివేసేలా ఉపాధ్యాయుని విధుల్లోకి తీసుకునేలా కలెక్టర్‌తో చర్చిస్తామని ఎమ్మెల్సీ షాబ్జీ తెలిపారు.

సుబ్రహ్మణ్యం షష్ఠి సందర్భంగా భక్తుల తాకిడి

విశాలాంధ్ర - దేవరపల్లి : సుబ్రహ్మణ్య షష్ఠి మహెూత్సవం దేవరపల్లిలో గల శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో భక్తులు బారులు తీరి దైవ దర్శనం చేసుకున్నారు. తెల్లవారు జామున స్వామివారికి మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం జరిగింది. తెల్లవారు జామున స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామున గం.4 నుండి భక్తులు బారులు తీరి దైవ దర్శనం చేసుకున్నారు. దాదాపు కిలోమీటర్ దూరం వరకు భక్తులు బారులు తీరి నిలబడ్డారు. దైవదర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. ఆలయ అర్చకులు అఖండ వంశీకృష్ణమూర్తి స్వామివారి అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. దేవరపల్లి మండలంలో దుద్దుకూరు, గౌరీపట్నం, లక్ష్మీపురం, ఎర్నగూడెం, యాదవోలు, చిన్నాయిగూడెం గ్రామాలలో శివాలయాల వద్ద భక్తులు బారులు తీరి దైవ దర్శనం చేసుకున్నారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ప్రత్యేక వాహనంపై దేవరపల్లి పురవీధులలో స్వామివారిని ఊరేగించారు. మధ్యాహ్నం స్థానిక భక్తులు విష్ణు సహస్రనామ పారాయణ, లలితా పారాయణ, అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు.

వానరాలకు తాగునీటి ఏర్పాట్లు

విశాలాంధ్ర-ఉంగుటూరు: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆరాధ్య దైవం, ఆంజనేయస్వామి వారి రూపాంతరాలైన వానరాలకు త్రాగు నీరు ఏర్పాటు చేశారు. శ్రీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ మంచినీరు ట్యాంకర్ ద్వారా గతంలో ఏర్పాటు చేసిన నీళ్ళ కుండీలలో మంగళవారం త్రాగునీరు సమకూర్చారు. వానరాలకు ఆహారంగా మరమరాలు ఏర్పాటు చేశారు. ఉంగుటూరు మండలం గొల్ల గూడెం నుండి ద్వారకాతిరుమల మండలం జి. కొత్తపల్లి వరకు ప్రధాన రహదారి ఇరువైపులా మూగ జీవాలకు,వానరాలకు దప్పిక తీర్చేందుకు శ్రీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ లారీ ట్యాంకర్ ద్వారా జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గం ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు తాగునీరు సరఫరా చేపట్టారు.

ఇదేమి కర్మ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

విశాలాంధ్ర -కైకలూరు: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఇదేమి కర్మ మన రాష్ట్రానికి పర్యటన నిమిత్తం చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకట రమణ కోరారు.ఈ నెల 30 న ఏలూరు జిల్లాలో నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయడానికి కలపర్రు టోల్ గేట్ స్వాగతం పలకడానికి కైకలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆటపాక నుండి ఉదయం 7 గంటలకు తెలుగుదేశంపార్టీనాయకులు ,కార్యకర్తలు అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఒక ప్రకటన లో తెలిపారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - పెంటపాడు : వల్లూరుపల్లి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం జాయింట్ కలెక్టర్ మురళి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఏ విధంగా కొనుగోలు చేస్తున్నారో వివరాలు పరిశీలించారు. ఎంతమంది ధాన్యం కొనుగోలు చేశారు. ఎంతమందికి పేమెంట్లు జరిగియి, ఏ రేటుకు ధాన్యం కొనుగోలు చేశారు తదితర వివరాలను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. ఆర్బీకేకు వచ్చిన రైతులతో జాయింట్ కలెక్టర్ మాట్లాడి పంట వివరాలు, ఎన్ని ఎకరాలలో పంట వేశారు, ఎప్పుడు కోతకోసారు, ఎప్పుడు ఇక్కడికి ధాన్యం తెచ్చారు,ఎంత దిగుబడి వచ్చింది తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది , రైతులు తదితరులు పాల్గొన్నారు.